ఇంటర్వ్యూ



ఓటమితో కుంగిపోవద్దు..

- పట్టుదల, సహనంతో లక్ష్య సాధనకు శ్రమించాలి
- మొదటి వైఫల్యం నుంచి బయటపడటానికి ఆర్నెల్లు పట్టింది
- ఐదేళ్లపాటు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉన్నా
- ఐపీఎస్ కావాలని విద్యార్థి దశలోనే నిర్ణయించుకున్నా
- గంజాయి నిర్మూలన, టెక్నాలజీ వాడకంపై ఫోకస్ చేస్తా
- గోల్ మీద క్లారిటీ ఉంటేనే ఎవరైనా విజయం సాధిస్తారు
- ట్రైనీ ఐపీఎస్ కొట్టె రుత్విక్ సాయి

ఖమ్మం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): 'కృషి ఉంటే మనుషులు రుషులవుతారు..' అనే సూక్తిని ఆయన రుజువు చేశారు. సంద్రంలో ఆటుపోట్లను తట్టుకుని ఒడ్డుకు చేరిన పడవ మాదిరిగా.. అనేక ఒడిదొడుకులను అధిగమించి ఆయన విజయం అనే తీరం చేరారు. ఓటమి.. విజయానికి తొలి మెట్టు అన్న నానుడిని ఆయన నిజం చేసి చూపించారు. సాధారణ పాఠశాలల్లో చదివినవారు సివిల్స్ ఎందుకు సాధించకూడదన్న పట్టుదలతో ముందుకు సాగి తనదైన కఠోర శ్రమతో విజయాన్ని అందుకున్నారు. విఫలమైనప్పుడు కుంగిపోకుండా పట్టుదల, సమరోత్సాహంతో ముందుకు సాగి ఐదో ప్రయత్నంలో తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు. ఆయనే ట్రైనీ ఐపీఎస్ అధికారి కొట్టె రుత్విక్ సాయి. 2023 సివిల్స్ ఫలితాల్లో ఐపీఎస్‌కు ఎంపికై శిక్షణ అనంతరం ప్రస్తుతం ఖమ్మం పోలీసు కమిషనరేట్‌లో ట్రైనీ ఐపీఎస్‌గా పనిచేస్తున్నారు. తన నేపథ్యం, స్వప్న సాకారం కోసం తాను పడిన శ్రమ తదితర అంశాలకు సంబంధించి ఆయన 'ఆంధ్రజ్యోతి'తో తన (మిగతా 6వ పేజీలో)



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో స్వర్ణకుమారి, రాజశేఖర్ తదితరులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఈ నెల 26 నుంచి నాలుగు పథకాల అమలు
- పేదలకు రేషన్‌కార్డులు... రైతులకు రైతుభరోసా..
- భూమిలేని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయభరోసా..
- ఇళ్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు..
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒకేసారి నాలుగు సంక్షేమ పథకాలు అమలుచేయబోతున్నామని, రాష్ట్రంలో పేదల అభివృద్ధి, సంక్షేమానికి ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా శ్రీకారం చుట్టబోతున్నామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. పేదలకు రేషన్‌కార్డులు, రైతులకు రైతుభరోసా, భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇళ్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం చేపట్టబోతున్నామని, ప్రజలు ఈ పథకాలను సద్వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో త్వరలోనే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు నియామక పదవులుంటాయని తెలిపారు. ఖమ్మంలో శనివారం ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు.

రాష్ట్రంలో ఈ సంక్రాంతి నుంచి సంక్షేమరాజ్యం రాబోతుందని, ఈనెల 26 నుంచి సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపికలు నిర్వహించి, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా ఈ నెల 26నుంచి పథకాలు అమలుచేయబోతున్నామని స్పష్టంచేశారు. రేషన్‌కార్డులను నిరుపేదలదరికీ తెల్లరేషన్ కార్డులు కూడా ఇవ్వబోతున్నామని తెలిపారు.

రైతుభరోసా కింద రూ.12వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, పంటల పెట్టుబడిగా ఇచ్చే ఈ సొమ్మును సాగు చేసే రైతులకు ఇవ్వడం జరుగుతుందని, దీనికి సంబంధించి గ్రామసభల్లోనే కొండలు, గుట్టలు, సాగుచేయని భూములు, రియల్‌ఎస్టేట్‌గా మారిన భూములను గుర్తించి వాటిని తొలగిస్తామని స్పష్టంచేశారు. ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసాను ఈనెల 26నుంచి ఇవ్వబోతున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని నిరుపేద ప్రతి కుటుబాన్ని ఒక యూనిట్‌గా గుర్తించి ఎన్ఆర్ఈజీఎస్‌లో 20రోజుల పాటు పనిచేసిన వారికి ఏడాదికి రూ.12వేలు రెండు విడతలుగా రూ.6వేల చొప్పున ఈనెల 26నుంచే శ్రీకారం చుట్టబోతున్నామని తెలిపారు. ఇందుకోసం ఈనెల 16నుంచే రాష్ట్రంలో గ్రామసభలు ద్వారా లబ్ధిదారులను గుర్తించే కార్యక్రమం ఉంటుందన్నారు.

పేదలందరికి ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని కూడా ఈనెల 26నుంచే మంజూరు చేయబోతున్నామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేశామని, 400 చదరపు అడుగులకు రూ.5లక్షలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్‌శాఖను ప్రక్షాళన చేయబోతున్నామని ఎక్కడా అవినీతి అక్రమాలు లేకుండా చూస్తామని, కర్ణాటక మోడల్‌గా రిజిస్ట్రేషన్ శాఖలో రిజిస్ట్రేషన్లు నిర్వహించబోతున్నామని తెలిపారు. అధికంగా రిజిస్ట్రేషన్లు జరిగిన చోట చట్టవిరుద్ధంగా చేస్తేచర్యలు తప్పవని, వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్‌లపైనా విచారణ చేపిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ లొట్టపీసు కేసు... లొట్టపీసు ముఖ్యమంత్రి అంటూ చేసిన వ్యాఖ్యలపై (మిగతా 6వ పేజీలో)

జేఎన్‌టీయూ భవనాలకు సీఎంతో శంకుస్థాపన

6



వంతెనకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

ఆదివాసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

- హామీ ఇచ్చిన నెలరోజుల్లోనే పూసుకుంటలో అభివృద్ధి ఫలాలు
- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
- మనం కాదు, మనం చేసిన పనులే శాశ్వతం
- ఆగిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభిస్తాం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- పూసుకుంటలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం
- గ్రామస్థులకు దుస్తుల పంపిణీ

అశ్వారావుపేట/ దమ్మపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): 'మనం ఎవరమూ శాశ్వతం కాదు.. మనం చేసిన పనులే శాశ్వతం.. ఈ విషయాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు గుర్తించి పనిచేయాలి.. ప్రజలలో మంచి పేరు తెచ్చుకోవాలి..' అని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని కొండరెడ్ల గ్రామమైన పూసుకుంటలో శనివారం ఆయన ఎంపీ ఆర్.రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ జితేశ్ వి. పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలసి పర్యటించారు.

ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఆదివాసీల సమగ్ర అభివృద్ధికోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆదివాసీలకు చదువు, వ్యవసాయం, ఇందిరమ్మ ఇళ్లు, జీవనోపాధికోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. కొండరెడ్ల గ్రామాలైన పూసుకుంట, కట్కూరు, పాతరెడ్డిగూడెం, సుద్దగోతులగూడెం, నడిమిరెడ్డిగూడెం, గోగులపూడి, గాండ్లగూడెం గ్రామాలను తన హయాంలో అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పూసుకుంట గ్రామానికి నెలరోజుల క్రితం ఎమ్మెల్యే ఆదినారాయణతో వచ్చి కొండరెడ్ల అభివృద్ధికోసం అన్ని అవకాశాలను ఉపయోగిస్తానని హామీని ఇవ్వడం జరిగిందని, అందులో భాగంగా శనివారం రూ.4.18కోట్లతో మూడు వంతెనలు, 12 బోర్లు, విద్యుత్ మోటార్లు, పామాయిల్ తోటలను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఆగిపోయిన పూసుకుంట రహదారిని తిరిగి ప్రారంభిస్తామని, ఈ రహదారిపైన మూడు కల్వర్టులను పూర్తి చేయనున్నట్టు తెలిపారు. పూసుకుంట గ్రామాన్ని బాహ్య ప్రపంచంలో అభివృద్ధి దశగా తీసుకెళ్లటానికి ప్రణాళిక చేపడుతున్నామన్నారు. కొత్తగూడెం విమానాశ్రయం, కొత్తగూడెం-కొవ్వూరు రైల్వే లైన్, (మిగతా 6వ పేజీలో)



పల్లెల్లో సంక్రాంతి.. సందడి

తెలుగు వారి పెద్ద పండుగైన సంక్రాంతికి పట్టణాలన్నీ పల్లెబాట పట్టాయి. వివిధ పనులు చేసుకునే వారంతా సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో ప్రయాణ ప్రాంగణాలు కిక్కిరిసిపోతున్నాయి. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పిల్లలు గాలిపటాలను ఎగురవేస్తూ కాలక్షేపం చేస్తున్నారు. పండుగ సందర్భంగా నోరూరించే సంప్రదాయ పిండివంటల తయారీలో మహిళలు నిమగ్నమయ్యారు. 6



'మధ్యవర్తిత్వ' న్యాయవాదుల
నియామకం

ఖమ్మం లీగల్ జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న మధ్యవర్తిత్వ పరిష్కార కేంద్రం న్యాయవాదులుగా అలవాల యుగంధర్, బొడ్డు పద్మ ప్రసూన, సరికొండ శ్రీనాథ్ నియమితులయ్యారు. వీరికి ఈనెల 6 నుంచి 10 వరకు సికింద్రాబాద్‌లోని రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్యాం కోషి, జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ జె. శ్రీనివాస్‌రావు చేతులమీదుగా వారు శిక్షణ ధ్రువపత్రాలను అందుకున్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం
వ్యక్తి అరెస్టు

కామేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామానికి చెందిన బోడా మంగ్యాజీ నాయక్ ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి నుంచి డబ్బులు తీసుకున్నాడు. సూపర్ వైజర్, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు పేరిట నిరుద్యోగలకు వల వేశాడు. వారి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశాడు. అయితే ఎంతకీ ఉద్యోగాలు రాకపోవడంతో భూక్య హరీష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం మంగ్యాజీనాయక్‌ను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ బి. సాయికుమార్ తెలిపారు.

కేఎంసీలో సిటీ కంట్రోల్‌రూమ్

- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు
- పారిశుధ్యం, ప్రభుత్వ వాహనాలకు జీపీఎస్ ట్రాకర్లు
- కంట్రోల్‌రూం నుంచే నిరంతర పర్యవేక్షణ
- కమిషనర్ అభిషేక్ ఆగస్త్య వినూత్న ప్రయత్నం



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరపాలక సంస్థ పరిపాలనలో ఇకపై నిఘానేత్రం రాత్రింబవళ్లు పని చేయనుంది. పారిశుధ్య వాహనాలు, స్వచ్ఛ భారత్ ఆటోల నుంచి పరిపాలనాపరమైన అధికారుల వాహనాలపై నిఘా ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య కార్యాచరణ రూపొందించారు. అందులో భాగంగా కేఎంసీ కార్యాలయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సిటీ కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు.

జీపీఎస్‌తో నిరంతర ట్రాకింగ్

ఖమ్మం నగరంలోని 60డివిజన్లలో పారిశుధ్య పనుల పర్యవేక్షణకు 140వరకు పారిశుధ్య వాహనాలు ఉన్నాయి. వాటి పర్యవేక్షణపై అనేక విమర్శలు రావటంతో కమిషనర్ అభిషేక్ ఆగస్త్య పారిశుధ్య వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆయా వాహనాల డ్రైవర్లు తమ వాహనాలకు డీజిల్ కొట్టించే విషయంలో అవకతవకలకు పాల్పడిన విషయం వెలుగులోకి రావడంతో మరింత ఆధునిక సాంకేతిక విజ్ఞానం వినియోగించి పారిశుధ్య పర్యవేక్షణ చేయాలని కమిషనర్ కార్యాచరణ చేసి కేఎంసీలో సిటీ కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. పారిశుధ్య వాహనాలను కంట్రోల్ వ్యవస్థ 24గంటలూ ట్రాక్ చేస్తూ ఉంటుంది.

24గంటల్లో పరిష్కారానికి ఫిర్యాదుల నెంబర్

సిటీ కంట్రోల్‌రూమ్‌లో ప్రత్యేకంగా ఫిర్యాదుల నెంబర్‌ను ఏర్పాటు చేయనున్నారు. పారిశుధ్య సమస్యలపై నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వాటిని రెండు రోజుల లోపుగా పరిష్కరించి ఫిర్యాదుదారులకు సమాధానం పంపేలా కార్యాచరణ చేస్తున్నారు. కంట్రోల్‌రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అధికారులకు వాకీటాకీలను అందించేందుకు ఏర్పాట్లు కమిషనర్ చేపట్టారు.

కంట్రోల్‌రూమ్‌ను పరిశీలించిన కమిషనర్ అభిషేక్

ఖమ్మం నగర పాలక సంస్థలోని సిటీ కంట్రోల్‌రూమ్‌ను కమిషనర్ అభిషేక్ ఆగస్త్య శనివారం పరిశీలించారు. పారిశుధ్య వాహనాల ట్రాకింగ్ వ్యవస్థ, కంట్రోల్‌రూమ్ నుంచి పారిశుధ్య ఉద్యోగులను పర్యవేక్షణ చేసే విషయాలపై ఐటీ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. 140 పారిశుధ్య వాహనాలు, 60 ట్రాక్టర్లు, పారిశుధ్య ఎస్ఐలకు, జవాన్లుకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు వాకీటాకీలు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

లాటరీ పేరుతో మోసం...

- రూ.4లక్షల24వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- వివరాలు వెల్లడించిన సీఐ బాలకృష్ణ

7

భక్తి ప్రపత్తులతో 'కూడారై'

- 108 గంగాళాలతో పరమాన్నం నివేదన
- రామాలయంలో ధనుర్మాస మహోత్సవాలు



పల్లెల్లో సంక్రాంతి.. సందడి



- ప్రతి ఇంటా పిండి వంటల ఘుమఘుమలు
- విద్యాసంస్థలకు సెలవులతో గాలిపటాలతో చిన్నారులు బిజీ
- ఇరు జిల్లాల్లో కొనసాగుతున్న ముగ్గుల పోటీలు
- కోడిపందేలకు ఏపీకి తరలుతున్న ఔత్సాహికులు

ఖమ్మం సాంస్కృతికం/కల్లూరు/ఇల్లెందు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సంక్రాంతి సందడి మొదలైంది. విద్య, ఉద్యోగాల కోసం పట్టణాలకు వలస వెళ్లినవారంతా తమ స్వస్థలాలకు చేరుకోవడంతో ప్రతిఇంటా సందడి నెలకొంది. ఆంధ్రాకు సరిహద్దున్న ఉన్న ఉమ్మడిజిల్లాలో రెండు ప్రాంతాల సంస్కృతి సంప్రదాయాలు కనపడుతున్నాయి. ఇటు తెలంగాణ ప్రత్యేక వంటకాలైన సకినాలు, సర్వపిండి, కారప్పూస వంటి పిండి పదార్థాలతో పాటు ఆంధ్రా స్పెషల్ అరిసెలు, సున్నుండలు కూడా ఘుమఘుమలాడుతున్నాయి. ఆంధ్రాకు దీటుగా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సంక్రాంతి సంబురాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. హరిదాసుల కీర్తలు, గంగిరెద్దుల విన్యాసాలతో పల్లెలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. సరిహద్దున ఏపీ ప్రాంతాల్లో కోడి పందాలు సాగుతుండడంతో వాటిపై ఆసక్తి ఉన్నవారు అక్కడ వాలిపోతున్నారు. విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వటంతో పిల్లలు, యువతీయువకుల్లో జోష్ కనిపిస్తోంది.

జోరుగా పిండి వంటల తయారీ...

ఆంగ్ల సంవత్సరాదిలో వచ్చే తొలి పండుగ అయిన సంక్రాంతి రైతులు, పాడిపంటలతో ముడిపడి ఉండడంతో అన్ని వర్గాల్లో ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. సంక్రాంతికి కొత్త పంటలు చేతికి రావడంతో పిండి వంటలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. ఈ పండుగకు ప్రత్యేకంగా తయారు చేసే సకినాలు, అరిసెలు, సర్వపిండి, జంతికలు నోరూరిస్తాయి. సాధారణ రోజుల్లో తినుబండారాలను దుకాణాల్లో కొనుగోలు చేసే ప్రజలు సంక్రాంతికి మాత్రం సంప్రదాయబద్ధంగా తమ ఇళ్లల్లోనే పిండి వంటలు తయారు చేసుకునేందుకు ఇష్టపడుతున్నారు. ఇరుగుపొరుగు వారు బంధుమిత్రులతో కలిసి పిండి వంటల తయారీలో నిమగ్నమయ్యారు. అరిసెలు తయారీకి అవసరమయ్యే బియ్యం పిండి, సకినాల తయారికి వినియోగించే మినుములు, బియ్యం పిండి పట్టించేందుకు స్థానికంగా ఉన్న మిల్లుల వద్దకు క్యూ కడుతున్నారు. గత ఏడాది వాతావరణం అనుకూలించక పంటలు సరిగా పండక రైతు కుటుంబాల్లో పండుగ సందడి పెద్దగా కనిపించలేదు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించి పంటలు పుష్కలంగా పండడంతో ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరుస్తోంది. కల్లూరు మండలంలోని చంద్రుపట్ల, చిన్నకోరుకొండి, పోచారం, లింగాల, యర్రబోయనపల్లి, చెన్నూరు, పెద్దకోరుకొండి తదితర గ్రామాల్లో మహిళలు పరస్పరం కలిసి శనివారం నుంచే పిండి వంటల తయారీలో నిమగ్నమయ్యారు. సింగరేణి పురుటిగడ్డ ఇల్లెందులోనూ సంక్రాంతి సందడి నెలకొంది. పిండి వంటల తయారీకి పిండి పట్టించేందుకు చిన్నా పెద్దా తేడా లేకుండా మిల్లుల వద్ద బారులు తీరారు. ఏ ఇంట్లో చూసినా పిండి వంటలు ఘుమఘుమలాడుతున్నాయి. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులు జరిగే ఈ పండుగను తమ శక్తి మేరకు జరుపుకునేందుకు కోల్‌బెల్ట్ ప్రజలు సిద్ధమయ్యారు.

వాకిళ్లకు రంగవల్లుల అందాలు..

సంక్రాంతి పండుగలో రంగవల్లులదే ప్రథమ స్థానం.. రంగురంగుల ముగ్గులతోనే ఇంటికి సంక్రాంతి శోభ వస్తుంది. సంకాత్రి నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంఘాలు, వ్యాపార, వాణిజ్య సంఘాలతో పాటు విద్యా సంస్థల్లో ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ మహిళలను ప్రోత్సహిస్తున్నారు. ముగ్గుల పోటీకి అవసరమైన రంగుల విక్రయాలతో మార్కెట్లు సందడిగా మారాయి. ఆంధ్రా ప్రాంతాలకు ప్రత్యేకమైన కోడి పందాల సంస్కృతి సంబురాలు జిల్లాలో సైతం కనిపిస్తోంది. తెలంగాణలో కోడిపందాలపై నిషేధం ఉండడంతో ఔత్సాహికులు ఆంధ్రా ప్రాంతంలో పోటీలు జరిగే ప్రాంతాలకు తరలి వెళుతున్నారు. ఇందు కోసం జిల్లాలో ప్రత్యేకంగా పెంచుతున్న పందెం కోళ్లను కొనుగోలు చేస్తున్నారు.

సంక్రాంతిలో పతంగుల జోష్..

సంక్రాంతికి మరో ముఖ్యమైన అంశం గాలిపటాలు.. సంక్రాంతి సమయంలో చలిగాలు వీస్తుండడంతో చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ పతంగులను ఎగురవేస్తూ సందడి చేస్తారు. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా పతంగులు ఎగురవేస్తూ యువకులు సందడి చేస్తున్నారు. మార్కెట్‌లో రంగురంగుల పతంగుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. రూ.10నుంచి రూ.200 వరకు పతంగులు అమ్మకానికి ఉన్నాయి. ఈ ఏడాది సంక్రాంతి ఆరంభంలోనే చైనా మాంజతో ప్రమాదాలు జరగడంతో పోలీసులు చైనా మాంజాపై నిషేధం విధించారు. ఇక గాలిపటాలు ఎగుర వేసే సమయంలో పిల్లలు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. డాబాలపై, బావుల సమీపంలో పతంగులు ఎగురవేసేవారు అప్రమత్తంగా ఉండాలి. లేదంటే పండుగ వేళ విషాదం నెలకొనే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో క్రీడామైదానాల్లో గాలి పటాలు ఎగుర వేయడం సురక్షితమని పోలీసులు చెబుతున్నారు.



గాలిపటాలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



పతంగులు కొనుగోలు చేస్తున్న దృశ్యం

సురేష్ రెడ్డికి కలాం నేషనల్ అవార్డు

పాల్వంచటౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డును సామాజిక సేవా కేటగిరీలో భాగంగా పాల్వంచకు చెందిన నల్లా సురేష్‌రెడ్డికి దక్కింది. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు శనివారం పాల్వంచలోని తన నివాసంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా నల్లా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ 17వ నేషనల్ కాన్ఫరెన్స్ జాతీయ అవార్డుల కమిటీ (న్యూఢిల్లీ) తాను చేసిన పలు సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డుకు తనను ఎంపిక చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ అవార్డుతో తనపై ఉన్న బాధ్యత మరింత పెరిగిందని, భవిష్యత్తులో మరిన్ని సేవాకార్యక్రమాలను నిర్వహించడానికి ఈ అవార్డు దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వెదిరే రామకృష్ణారెడ్డి, గడ్డం రవీందర్‌రెడ్డి, కొడుపుగంటి శ్రీనివాస్, రావుల శివ, కృష్ణ, ఆరెం ప్రశాంత్, అశోక్‌రెడ్డి, పెండ్లి రామిరెడ్డి, విజయ్‌కుమార్, సూర్య మల్లేష్, సందీప్, వీరన్న, మోతీర్, విజయ్, రాంకిషోర్, ఆదాం, ఫణి, దాస్, బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డును స్వీకరిస్తున్న సురేష్‌రెడ్డి

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంటౌన్, జనవరి11 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పటిష్ఠ కార్యాచరణ చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలసి కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర అంశాలపై సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం నుంచి ఈ పథకాలు ప్రారంభం అవుతాయని, మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీ అధికారి, వ్యవసాయ అధికారి పథకాల అమలుకు బాధ్యత వహించాలన్నారు. ప్రతి గ్రామంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణాధికారి, ఇతర గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించి జాబితా నుంచి సదరు లబ్ధిదారులను తొలగించాలన్నారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు పంట వేసినా, వేయకపోయినా రైతు భరోసా అందుతుందని కలెక్టర్ తెలిపారు. రైతులలో నెలకొన్న అపోహలను అధికారులు తొలగించాలన్నారు. ఇల్లు లేదా కాలనీలుగా మారిన భూములు, రియల్ ఎస్టేట్ లేఅవుట్లు, రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలకు, మైనింగ్‌కు, గోదాములకు వినియోగిస్తున్న భూములు, ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల భూములు, రాళ్లు, రప్పలు, గుట్టలతో ఉండి సాగుకు అనుకూలంగా లేని భూములను గుర్తించి, వాటిని జాబితా నుంచి తొలగించాలని, వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతుభరోసా అమలు చేయాలన్నారు. రైతుభరోసా పథకానికి ఎటువంటి పరిమితులు లేవని, వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రూ.12వేలు పెట్టుబడి సాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లాలో 20రోజులు ఉపాధిహామీ కూలీలుగా పనిచేసిన కార్మికుల జాబితా తీసుకొని, ఆధార్‌కార్డు ప్రకారం భూమిలేని కుటుంబాలను ఎంపిక చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో నగర పాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్‌డీవో సన్యాసయ్య, డీపీవో ఆశాలత, హౌజింగ్ పీడీ శ్రీనివాసరావు, ఏడీవో పుల్లయ్య, పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

ఓటమితో కుంగిపోవద్దు..

- పట్టుదల, సహనంతో లక్ష్య సాధనకు శ్రమించాలి
- మొదటి ఓటమి నుంచి బయటపడటానికి ఆర్నెల్లు పట్టింది
- ట్రెయినీ ఐపీఎస్ కొట్టె రుత్విక్ సాయి

(5వ పేజీ తరువాయి)

మనోగతాన్ని పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే...

మాది హనుమకొండ.. నాన్న కొట్టె రాధాకృష్ణ, అమ్మ మంజుల. నాన్న సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో లైబ్రేరియన్‌గా పని చేస్తున్నారు. అమ్మ గృహిణి. అక్క రిషిక జనరల్ మెడిసిన్ పూర్తిచేసింది. పాఠశాల విద్య హనుమకొండలో, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లో, బీటెక్ శివనాడార్ యూనివర్సిటీలో పూర్తి చేశా. నాకు చిన్నప్పటి నుంచి ర్యాంకింగ్ ఆఫీసర్ ఉద్యోగం మీద ఇష్టం ఉండటంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు వెళ్లలేదు. నా విద్యార్థి దశలో మా అమ్మానాన్నతోపాటు కుటుంబసభ్యులు.. ఉన్నతస్థాయిలో ఉన్న అధికారులను చూపించి వారి స్థానంలో ఉంటే సమాజానికి ఎలా సేవలు అందించవచ్చో చెబుతూ ఉండేవారు. మా ఇల్లు కూడా పోలీసు క్వార్టర్స్ వెనుక ఉండటం, మా మేనమామలు రాజు, కిరణ్ అప్పట్లో గ్రూప్స్‌కి ప్రిపేర్ అవ్వడం నన్ను ప్రభావితం చేస్తూ వచ్చాయి.

ఎగతాళి చేస్తారేమోనని భయం..

నేను బీటెక్ చివరి సంవత్సరంలో ఉన్నప్పటి నుంచే మరో ముగ్గురు స్నేహితులతో కలిసి సివిల్స్ ప్రిపరేషన్ మొదలుపెట్టా. మొదటిసారి 0.80 మార్జిన్‌తో ప్రిలిమ్స్ క్వాలిఫై అవ్వలేదు. రెండోసారి మెయిన్స్ వరకు వెళ్లా 10 మార్కుల మార్జిన్‌తో, ఆ తర్వాత రెండుసార్లు 0.13, అర మార్కు తేడాతో ప్రిలిమ్స్‌లోనే వెనకడుగు పడింది. సివిల్స్ ప్రిలిమినరీకి ప్రతి ఏటా సగటున 10 లక్షల మంది దరఖాస్తు చేస్తారు. చివరికి 800 మంది మాత్రమే ఎంపికవుతారు. అందులో నేను ఉంటానా? అనే సందేహం ఉండేది. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న సందర్భంలో ఇంటికి వెళ్లాలంటేనే జంకుగా ఉండేది. చుట్టాలు, తెలిసిన వాళ్లు కలిసిన సందర్భంలో 'ఇంకా క్వాలిఫై కావడం లేదా...' అని ప్రశ్నించే వారు. వారి మాటల్లో కొంత ఎగతాళి కనిపించేది. అయినా నా ఆత్మవిశ్వాసం ముందు అవి నిలువలేదు. మొదటి నాలుగు ప్రయత్నాల్లో కొద్దిపాటి మార్జిన్‌తోనే క్వాలిఫై కాలేదు కాబట్టి, ఆ తర్వాత ప్రతీ స్టేజీని సిరియస్‌గా తీసుకుని ముందుకెళ్లి సక్సెస్ అయ్యాను.

ఆర్నెల్లు పట్టింది..

సివిల్స్ ప్రిపరేషన్ కోసం ఢిల్లీ వెళ్లిన సమయంలో ర్యాంకు సాధించాలన్న లక్ష్యం ఒక్కటే ముందుడేది. వెళ్లే ముందు నా మొబైల్ నెంబర్ కూడా మార్చేశా. సోషల్ మీడియా అకౌంట్లన్నీ తొలగించేశా. రోజులో నిద్రపోడానికి మినహా మిగిలిన సమయమంతా ప్రిపరేషన్ కోసమే కేటాయించేవాడిని. గంటల తరబడి సబ్జెక్ట్ మీదనే ఫోకస్ చేసేవాడిని. అంత చేసినా మొదటిసారి ప్రిలిమ్స్‌లోనే క్వాలిఫై కాలేదు. ఆ సమయంలో చాలా నిరాశకు లోనయ్యా. దాని నుంచి బయటపడటానికి ఆరు నెలల సమయం పట్టింది. ఓటమిని పాఠంగా తీసుకుని ముందుకెళ్లడం ప్రారంభించాను. లోపం ఎక్కడ ఉందో సరిచూసుకుంటూ ప్రిపేర్ అవ్వడం మొదలుపెట్టాను. నేను ఎక్కువగా మెయిన్స్ కోసం ప్రిపేర్ అయ్యేవాడిని. అందువల్లనే మూడోసారి, నాలుగోసారి ప్రిలిమ్స్‌లో క్వాలిఫై కాలేకపోయా. అది గుర్తించి అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకోవడం మొదలుపెట్టా. గతంలో క్వాలిఫై అయిన వారినుంచి సలహాలు తీసుకున్నా. చివరకు సక్సెస్ అయ్యాను. నా సివిల్స్ ప్రయాణంలో నా స్కూల్ ఫ్రెండ్స్ అందించిన ప్రోత్సాహం, ప్రేరణ ఎంతో విలువైనది. కొన్నిసమయాల్లో వారు ఆర్థికంగా కూడా అండగా నిలిచారు.

ఇంటర్వ్యూలో గంజాయి టాపిక్..

నాలుగోసారి క్వాలిఫై కానప్పుడు ఇక ప్రిపరేషన్‌ను వదిలేసి సాఫ్ట్‌వేర్ రంగంలోకి వెళ్లిపోదామనుకున్న. చివరగా ఈ ఒక్కసారి ప్రయత్నించిన తర్వాత సక్సెస్ అవ్వకపోతే చూద్దాం... అని ఐదోసారి రాశా. ఈ సారి ప్రిపరేషన్‌ను కష్టంగా కాకుండా, ఎంజాయ్ చేసుకుంటూ ఎందుకు రాయకూడదు అని రాశా. రిజల్ట్ మీద కాకుండా ప్రాసెస్ మీద ఫోకస్ చేశా. పరీక్ష అన్న ఒత్తిడిని పక్కనపెట్టా. దాంతో అన్ని స్టేజీలను సులభంగా క్లియర్ చేయగలిగా. ఇక నా డిటేల్ ఇంటర్వ్యూలో గంజాయి అంశాన్ని ప్రస్తావించాను. ఇంటర్వ్యూ(25 నిమిషాలు)లో ఆ విషయం మీదనే చర్చ నడిచింది. నా శ్రమ ఫలించడంతో చివరికి ర్యాంకు సాధించా. రాబోయే కాలంలో మహిళలకు సంబంధించిన, డ్రగ్స్, సైబర్ క్రైం అంశాలపై ఎక్కువ ఫోకస్ చేస్తా. నేరాలను నిరోధించడానికి టెక్నాలజీ ఎలా వాడాలి అనే అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకుంటా.

గోల్ మీద క్లారిటీ ఉండాలి..

యువత ఉన్నతంగా ఎదిగేందుకు నేడు మంచి అవకాశాలున్నాయి. ఎవరికైనా ముందు గోల్ మీద క్లారిటీ ఉండాలి. సహనంతో ముందుకెళ్లి వాటిని సాధించుకోవాలి. ఎవరైనా తమ లక్ష్యం సాధించలేకపోతున్నారు అంటే.. అందులో ఎక్కడో ఒకచోట చిన్న చిన్న లోటుపాట్లు జరిగి ఉండొచ్చు. వాటిని సరిదిద్దుకుని మళ్లీ ప్రయత్నం చేస్తూ ఉండాలి.

సాధించాలనుకున్న లక్ష్యంలో.. ముందు విజేతలు ఎవరున్నారో కనుక్కుని వారిని కలవడం, వారి అనుభవాలను తెలుసుకోవడం వంటివి చేయాలి. ఓటమిని సైతం పాజిటివ్‌గా తీసుకోవాలి. ఏదైనా బుక్ చదువుతున్నప్పుడు అదే లాస్ట్ చదువుతున్నట్టుగా భావించాలి. ప్రతీ పాయింట్‌ను గుర్తుంచుకోవాలి. ప్రతీ పరీక్షను చివరి పరీక్షగా భావించి ప్రిపేర్ అవ్వాలి. తక్కువ చదవాలి.. ఎక్కువ గుర్తుంచుకోవాలి. ఇలా చేస్తే సక్సెస్ సాకారమవుతుంది.

వ్యక్తిగత వివరాలు

పూర్తి పేరు: కొట్టె రుత్విక్‌సాయి
తల్లిదండ్రులు: కొట్టె రాధాకృష్ణ-మంజుల
భార్య: ద్వారకా సోనాక్షి
చదువు: బీ.టెక్ (శివనాడార్ యూనివర్సిటీ)
అక్క-బావ: రిషిక, గంపా శశాంక్
సివిల్స్‌కు ఎంపికైన సంవత్సరం: 2023
స్వస్థలం : హనుమకొండ



అర్హులందరికీ సంక్షేమ పథకాలు

(5వ పేజీ తరువాయి)

మంత్రి స్పందిస్తూ ఆయన విదేశాల్లో చదివి వచ్చారు. ఆయన భాషకు, సంస్కారానికి నమస్కారం. ఆయన ప్రతి మాటను ప్రజలు గమనిస్తున్నారని, చట్టం, ప్రజలే సమాధానం చెప్పడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని అందుకే కేటీఆర్‌ను అరెస్టు చేయడంలేదని, కేటీఆర్ కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలతో మాట్లాడుకుని వచ్చారని, కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి స్పందిస్తూ... విచారణ కాకుండా ఏ వ్యక్తిని తొందరపడి తమ ప్రభుత్వం అరెస్టుచేయదని, అది బండిసంజయ్‌కు కూడా తెలుసన్నారు. ఏసీబీ ఈ కేసు రిజిస్టర్ చేసిన మరుక్షణం ఈడీ కూడా కేసును రిజిస్టర్ చేసిందని, ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం కొల్యూడ్ అయితే కేంద్ర ప్రభుత్వం, ఈడీ వారి చేతుల్లోనే ఉంది అరెస్టు చేయవచ్చు కదా అని ప్రశ్నించారు. మరి మీరేందుకు అరెస్టు చేయడంలేదో బండి సంజయ్ సమధానం చెప్పాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, రాష్ట్ర మహిళా ఆర్థిక సంస్థ చైర్మన్ మద్దినేని స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ భవనాలకు..
సీఎంతో శంకుస్థాపన

- మంత్రి పొంగులేటి

ఖమ్మం, జనవరి11(ఆంధ్రజ్యోతి): ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లిలోని పాలేరు జేఎన్‌టీయూ కళాశాల శాశ్వత భవనాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శంకుస్థాపన చేపిస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతిలో ఈనెల 8న ప్రచురితమైన 'నిధులున్నా నిర్లక్ష్యమేనా.. పాలేరు జేఎన్‌టీయూ భవనాల నిర్మాణంలో జాప్యం' అనే కథనానికి ఆయన స్పందించారు. పాలేరు జేఎన్‌టీయూకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు రూ.108.60కోట్లు నిధులు విడుల చేశామని, ముఖ్యమంత్రి చేతులమీదుగా కళాశాల భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయబోతున్నామని తెలిపారు. జేఎన్‌టీయూ కళాశాలతో పాటు పాలేరుకు మున్నేరు నుంచి నీరు మళ్లింపుతో పాటు లింక్‌కెనాల్ పనులకు ఇతర అభివృద్ధి పనులకు కలిపి శంకుస్థాపన సీఎంతో చేపించబోతున్నామని అందుకే జేఎన్‌టీయూభవన నిర్మాణ పనులకు కొంత ఆలస్యం జరుగుతుందని వివరించారు.

కరకగూడేన్ని కమ్మేసిన మంచు



కరకగూడెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా చలితో ప్రజలు గజగజ వణుకుతున్నారు. మండల వ్యాప్తంగా ఇటీవల అకాల వర్షాలు కురవడంతో చలి తీవ్రత పెరిగింది. పలు రోజులుగా చలి తీవ్రత, మంచు కురుస్తుండటంతో వృద్ధులు, చిన్నారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చలి పెరగడంతో మండల వ్యాప్తంగా మంచు కమ్మేస్తుంది. చలి తీవ్రత పెరగడంతో ప్రజలు చలి మంటల వద్ద వెచ్చదనం కోరుకుంటున్నారు. మంచు కురుస్తుండటంతో కొత్తందాలు కనువిందు చేస్తున్నాయి. కరకగూడెంను శనివారం మంచు దుప్పటి కమ్మేసింది. రహదారులు సైతం కనిపించకుండా మంచు కమ్ముకపోయింది. సుమారు పది గంటల వరకూ మంచు కురుస్తుండటంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడక తప్పలేదు. రైతులు వ్యవసాయ పనులకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ ప్రకృతి దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

ఆదివాసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..



దుస్తులు పంపిణీ చేస్తున్న తుమ్మల



పామాయిల్ మొక్కలు నాటుతున్న మంత్రి

(5వ పేజీ తరువాయి)

సత్తుపల్లి-విజయవాడ రైల్వే లైన్లు పూర్తిచేస్తే తన జీవితం ధన్యమవుతుందన్నారు. కొండరెడ్ల జాతిని రక్షించుకోవాలని, ఆడబిడ్డలను మంచి స్థాయిలో నిలబెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఆదివాసీలను ఏ విధంగా ఏ స్థాయిలో అభివృద్ధిచేయవచ్చునో ప్రణాళికలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించినట్టు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురామరెడ్డి సహాయ సహకారాలతో నియోజకవర్గ అభివృద్ధికోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కొండరెడ్లకోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తుందని, వాటిని అందిపుచ్చుకొని అభివృద్ధిచెందాలసిన బాధ్యత మీదేనని ఆయన అన్నారు. ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ముగ్గురు మంత్రులు జిల్లాను అభివృద్ధిబాటలో నడిపిస్తున్నారన్నారు. 30 ఏళ్లలో ఒక్క తుమ్మల నాగేశ్వరావు తప్ప ఇతరులెవ్వరూ కొండరెడ్లకోసం ఈ విధమైన సమావేశాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. ఈ సందర్భంగా 220 మంది మహిళలకు చీర, జాకెట్లు, 217 మంది పురుషులకు లుంగీలు టవల్స్, చదవుకునే చిన్నారులకు ఒక్కొక్కరికి రూ.868 విలువచేసే యూనిఫాం, స్లిప్పర్స్, టీషర్ట్స్, రెండు జతల బూట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీఎఫ్‌వో కృష్ణ గౌడ్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మధు, సీపీవో సంజీవరావు, సహాయ ప్రాజక్టు అధికారి డేవిడ్‌రాజ్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, తహసీల్దార్ వాణి, ఎంపీడీవో రవిచంద్రారెడ్డి, డీటీఆర్‌వైఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ, ఎఫ్‌డీవో ఉదయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు ఎలినరాఘవులు, కేవీ వసంతరావు, నాగ ప్రసాద్, నిర్మల పుల్లారావు పాల్గొన్నారు.

'ఓబన్న జీవితం భావితరాలకు ఆదర్శం'

చుంచుపల్లి, జనవరి11(ఆంధ్రజ్యోతి): ఓబన్న జీవితం భావితరాలకు ఆదర్శమని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. శనివారం వడ్డే ఓబన్న జయంతిని కలెక్టరేట్‌లో భద్రాద్రి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇందిర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించగా ముఖ్య అతిధిగా పాల్గొని చిత్ర పటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓబన్న ఆశయాలు భావితరాల ప్రతీక అన్నారు. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధీనంలో ఉన్న సమయంలో రేనాటీ పాలేగాళ్లకు మధ్య ఘర్షణలు క్రమేపి సాయుధ పోరాటాలుగా మారాయన్నారు. ఈ పోరాటాల్లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరు, ఈ భీకర పోరులో సైన్యాధ్యక్షుడిగా వడ్డే ఓబన్న పోషించిన వీరోచిత పాత్రను చరిత్రలో తక్కువ చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రమాదేవి, బీసీ కమ్యూనిటీ సంఘ నాయకులు శ్రీనివాసరావు, శేఖర్‌రావు, సైదులు, శివ, వెంకటేశ్వర్లు, దుర్గారావు, సత్యనారాయణ, శంకర్ పాల్గొన్నారు.

బస్టాండ్ల కిటకిట


ఖమ్మం పాత బస్టాండ్‌లో రద్దీ

ఖమ్మంఖానాపురం హవేలీ/కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్, జనవరి11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగతో ఉమ్మడి ఖమ్మంజిల్లా పరిధిలో బస్టాండ్‌లు ప్రయాణికులతో కిక్కిరిసాయి. శనివారం ఖమ్మం నూతనబస్టాండ్, సిటి బస్టాండ్, కొత్తగూడెంలోని ప్రధాన బస్టాండ్ ప్రయాణికులతో సందడిగా మారాయి. కోదాడ, సూర్యాపేట రూట్లలో బస్సులు ప్రయాణికులకు సరిపడా లేకపోవటంతో ఆర్టీసీ అధికారులతో గొడవకు దిగారు. పండుగకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిన అధికారులు రోజువారి బస్సుల సంఖ్యను తగ్గించారు.అదనపు బస్సులను పెంచి అందులో 50శాతం టికెట్ రేట్లను పెంచి డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని తదితర ఏసీ బస్సులను ఏర్పాటు చేశారు.ఫలితంగా ఉచిత ప్రయాణం లేకపోవటంతో మహిళా ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.


ఖమ్మం కొత్త బస్టాండ్‌లో..


ఖమ్మం పాతబస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు ప్రయాణికుల ఇక్కట్లు


భద్రాద్రి బస్టాండ్‌లో..

భక్తి ప్రపత్తులతో కూడారై ఉత్సవం

108 గంగాళాలతో పరమాన్నం నివేదన




కూడారై సందర్భంగా ప్రత్యేక పూజలు, పాల్గొన్న మహిళలు

భద్రాచలం,జనవరి11(ఆంధ్రజ్యోతి):భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాసమహోత్సవాల్లో భాగంగా కూడారై ఉత్సవాన్ని శనివారం నిర్వహించారు. రామాలయలో నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా గోదాదేవి అమ్మవారికి 27వ రోజున కూడారైని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా తిరుప్పావై, తిరుపళ్లేచ్చి అను ద్రవిడ ప్రబందాలను నివేదన సమయంలో అనుసంధానం చేశారు. గోదాదేవి అమ్మవారు శ్రీరంగనాథునితో తన వివాహం జరిగితే 108 గంగాళాలతో పాయసాన్నం నివేదన చేస్తానని సుందర బాహు స్వామికి మొక్కుకుంటుంది. ఈసమయంలో అమ్మవారితో శ్రీరంగనాథుని కల్యాణం జరగడం, ఆయనలో ఐక్యం అవడం జరిగింది. ఈక్రమంలో రామానుజల వారు అమ్మవారి మొక్కును తీరుస్తారు.ఈనేపథ్యంలో ఏటా ధనుర్మాస మహోత్సవాల సమయంలో కూడారై ఉత్సవాన్ని రామాలయంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా రామాలయంలో 108గంగాళాలతో పాయసాన్నం (పరమాన్నం) అమ్మవారికి ఎదురుగా ఏర్పాటు చేసి నివేదన చేస్తారు. మహిళా ముత్తైదువులకు గోదాదేవి ప్రతిమలను ఇచ్చి షోడశోపోచారాలతో శ్రీ కృష్ణ గోదాఅష్టోత్తరాన్ని పఠించారు. చివరగా కూడారై అనే పాశురాన్ని నక్ష త్రహారతితో నీరాజనం ఇస్తుండగా పఠించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి,ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉపప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, అమరవాది శ్రీనివాస రామానుజం, ముఖ్య అర్చకులు అమరవాది మధుసూదనాచార్యులు, కోటి విష్ణువర్ధ నాచార్యులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంత భూసమస్యలను పరిష్కరిస్తాం

- భద్రాద్రి జిల్లాలో ఐదు గ్రామాలు.. సర్వే కోసం ఎంపిక
- ఈ నివేదక ఆధారంగా పరిష్కారం
- రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కొత్తగూడెం,జనవరి11(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో భూసమస్యలు పరిష్కరిస్తామని రెవిన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయంలో శనివారంరాత్రి కలెక్టర్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి విలేకరుతో మాట్లాడారు. ఒక్కటే సర్వేనెంబరులో వేలాది ఎకరాలు ఉండటం వల్ల వీటిలో ఫారెస్ట్,ప్రభుత్వ భూమి, పట్టాదార్ భూములు కలిసి ఉండటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించామన్నారు. జిల్లాలోని ఐదునియోజకవర్గాల్లో ఒక్కొక్క గ్రామాన్ని ఎంచుకుని ఆ గ్రామాల్లో సర్వే నిర్వహిస్తామన్నారు. ఆ సర్వే నివేదికను ప్రభుత్వానికి అందచేసి రాష్ట్ర వ్యాప్తంగా భూముల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. వాస్తవంగా భూముల సమస్య ఏళ్ల తరబడి ఉందని, ఫలితంగా రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండాఉండేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రంలో కూడ పలు జిల్లాలోని పలు మండలాల్లో, నియోజకవర్గాల్లో భూముల విషయాల్లో వేలాది సమస్యలు ఉన్నాయని ఆ సమస్యలను పరిష్కరించేందుకు భూ పరిష్కారం నిర్వహించేందుకు భద్రాద్రి జిల్లాలోని ఐదు నియోజకవర్గ గిరిజన ప్రాంతాల్లో ఐదు గ్రామాలను ఎంపిక చేసుకుని సర్వే చేస్తామన్నారు. వాటిలో సుమారు 1500నుంచి 2వేల ఎకరాలు కలిగిన ఒక అతిపెద్ద సర్వే నెంబరులో సర్వేలు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఆ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సూచనలనుఈ సర్వేలో తీసుకుంటామన్నారు. ఈనివేదికను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు.ప్రభుత్వ భూమి ఎంత ఉంది. ప్రైవేట్ భూమి ఎంత ఉంది.. పట్టాదార్ భూమి ఎంత ఉన్నాయి అనేవి కూడ అర్థమవుతుందన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఇల్లెందు, పినపాక, అశ్వరావుపేట ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, కలెక్టర్ జితేష్‌వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఏడూళ్ల బయ్యారంహైస్కూల్‌లో
నేడు పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవం

పినపాక, జనవరి11 (ఆంధ్రజ్యోతి): ఏడూళ్ల బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి పూర్వవిద్యార్థులు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం స్వర్ణోత్సవం నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. పురుషులకు వాలీబాల్, క్రికెట్, షెటిల్, బాల్మెంటన్, త్రీకే రన్, మహిళలకు ముగ్గుల పోటీలతోపాటు మ్యూజికల్‌ఛైర్, టెన్నీకాయిట్ క్రీడలు నిర్వహించారు. ఆదివారం జరగబోయే స్వర్ణోత్సవ వేడుకల్లో 50 సంవత్సరాల పదోతరగతి పూర్వ విద్యార్థులు, వారి కుటుంబాలు కలుసుకోబోతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి 4వేలమంది హాజరు కానున్నట్లు నిర్వహ కమిటీ సభ్యులు తెలిపారు.


వేడుకల్లో భాగంగా ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

సంయుక్త కిసాన్‌మోర్చా నేతల దీక్ష

దల్లేవాల్ ప్రాణాలకు ముప్పు కలిగితే కేంద్రానిదే బాధ్యత

ఖమ్మంటౌన్,జనవరి11(ఆంధ్రజ్యోతి):వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు డిమాండ్ చేస్తూ నిరాహారదీక్ష చేస్తున్న రైతునేత జగజిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలకు ముప్పు కలిగితే అందుకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని సంయుక్త కిసాన్‌మోర్చా నేతలు హెచ్చరించారు. జగజిత్‌సింగ్ దీక్షకు మద్దతుగా శనివారం ఖమ్మం పాతబస్టాండ్ వద్ద సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లమల వేంకటేశ్వరరావు,బొంతు రాంబాబు, మాదినేని రమేష్, దొడ్డపాటి రమేష్, మల్లీదు నాగేశ్వరరావు సంఘీభావ రైతుదీక్ష నిర్వహించారు. ఈ రైతుదీక్షలో రఘునాధపాలెం సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, సంయుక్తకిసాన్‌మోర్చా నాయకులు మురళి, ఎం.సుబ్బారావు, మెరుగు సత్యనారాయణ, తాటి వేంకటేశ్వరరావు, బండి రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.



సంఘీభావ దీక్ష చేస్తున్న రైతునేతలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఖమ్మంక్రైం, జనవరి11(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు లారీ వెనుక టైరు కింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం ఖమ్మం నగరంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బేతంపూడి సమీపంలోని వెంకట్యా తండాకు చెందిన బోడ శ్రీనివాస్(19) అనే యువకుడు నగరంలో ఉంటూ ఇంజనీరింగ్ రెండో ఏడాది చదువుతున్నాడు. తనకు తెలిసిన వారిని కొత్త బస్టాండ్ నుంచి ఖమ్మం నగరంలోని టేకులపల్లి వద్ద దించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. వారిని ఎక్కించుకుని ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోకి రాగానే సిగ్నల్ పడడంతో ఆగారు. తర్వాత సిగ్నల్ పడి వెళుతున్న నేపథ్యంలో లారీని క్రాస్ చేసి వెళుతుండగా లారీ వెనుక టైరు కింద ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో లారీ వెనుక టైరు కింద పడి శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. ద్విచక్రవాహనంపై ఉన్న వారికి స్వల్పగాయాలయ్యాయి.. పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని వివరాలు సేకరించి అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అనంతరం పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాగా ఈఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టుటౌన్ పోలీసులు తెలిపారు.

తమ్మిలేరులో మహిళ మృతదేహం లభ్యం

సత్తుపల్లిరూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని తమ్మిలేరు వాగులో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. మండలంలోని కాకర్లపల్లికి చెందిన కుంటా చిన్న వెంకటేశ్వర్లు, దుర్గమ్మ దంపతుల కుమార్తె మారేశ్వరి (40) ఓ ప్రయివేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుంది. ఈ క్రమంలో ఇంటి నుంచి వెళ్లిన మారేశ్వరి కాలువలో శవమై తేలడంతో కుటుంబ సభ్యులు కన్నీళ్లపర్యంతమయ్యారు. మృతికిగల కారణాలు తెలియరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ టీ.కిరణ్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

బూర్గంపాడు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైన ఘటన పాత పినపాక వద్ద శుక్రవారం రాత్రి సమయంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం...బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామానికి మూల వెంకటరమణారెడ్డి అనే వ్యక్తి తన కారులో శుక్రవారం రాత్రి సమయంలో పాత పినపాక వద్ద వ్యవసాయ పొలానికి వెళ్లినట్లు తెలిపారు. కారును రహదారిపై ఉంచి పొలంలో పనులు చేయిస్తుండగా, ఈ క్రమంలో అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి కారు దగ్ధమవుతున్నట్లు తెలపగా... కారు దగ్గరకు చేరుకునే సమయానికి కారు పూర్తిగా దగ్ధమైందని బాధితుడు తెలిపాడు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే కారు దగ్ధమైనట్లు బాధితుడు పేర్కొన్నారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు.

కల్లంలో ఆరబోసిన మిర్చి చోరీ

కొణిజర్ల, జనవరి11(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంటను రైతు కల్లంలో ఆరబోయగా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని అనంతారం గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన కానూరి సీతరాములు అనే రైతు గ్రామసమీపంలోని కల్లంలో మిర్చిని ఆరబోశాడు. రాత్రంతా కాపలకాసిన రైతు తెల్లవారుజామున ఇంటికి వెళ్లి వద్దామని వెళ్లాడు. తిరిగి కల్లం దగ్గరకు వచ్చే సరికి ఆరబోసిన మిర్చి చెల్లాచెదురై కనిపించింది. సుమారు ఐదు క్వింటాళ్ల వరకు దొంగతనం జరిగి ఉంటుందని రైతు భావిస్తున్నాడు. జరిగిన చోరీపై పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు.

ఇటుకబట్టి కార్మికుడి ఆత్మహత్య

- హైటెన్షన్ విద్యుత్ టవర్‌కు ఉరేసుకున్నవైనం

ఖమ్మం రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): హైటెన్షన్ విద్యుత్ టవర్‌కు ఉరేసుకొని ఇటుకబట్టి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని కడిలిముబా గ్రామానికి చెందిన రోహిత్‌కుమార్(33)వలస కూలీగా పల్లెగూడెం పరిధిలోని ఓ ఇటుకబట్టిలో కొన్ని నెలలుగా పనిచేస్తున్నాడు. అయితే ఇటీవల అతడి మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో శుక్రవారం రాత్రి ఇంట్లోవాళ్లతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో గ్రామశివారు పొలాల్లోని హైటెన్షన్ టవర్ ఎక్కి దానికి ఉరేసుకున్నాడు. ఉదయం రైతులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అన్నం శ్రీనివాస్ బృందం సహాయంతో మృతదేహన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

- రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంటౌన్, జనవరి11(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగులో నిర్మించిన 80 ఇళ్ల గృహ సముదాయాన్ని మంత్రి పొంగులేటి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి శనివారం ప్రారంభించి, ఇళ్లపట్టాలను లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్రాంతి కానుకగా పేదలకు 80 డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందిస్తున్నామన్నారు. గత పదేళ్లలో అప్పటి ప్రభుత్వంలో జరిగిన అవకతవకలను సరిచేసేందుకు ఏడాది కాలం పట్టిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి విడతగా నియోజకవర్గానికి 3500 ఇళ్లు అందిస్తున్నామని, లబ్ధిదారుల సర్వే 90శాతం పూర్తయిందన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ సొంత ఇంటికోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి చొరవతో సొంతింటి కల సాకారం అయిందన్నారు. ఇక్కడి ఇళ్లకు రహదారి కోసం మంత్రి రూ.2కోట్లు మంజూరు చేశారని, అదే విధంగా లబ్ధిదారుల కోరిక మేరకు ఈనెల 20వ తేదీలోపు అంగన్ వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే మెప్మా ద్వారా మహిళలకు స్వయం ఉపాధి యూనిట్లు త్వరలో మంజూరు అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. నగరపాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ కాలనీలో నివశించే ప్రజలకోసం డంపింగ్ యార్డు నుంచి ఇక్కడి వరకు రూ.2కోట్లతో చేపట్టిన రహదారి నిర్మాణ పనులకు టెండర్లు చివరిదశకు చేరాయని, వచ్చేవారం పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్‌డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, హౌజింగ్ పీడీ శ్రీనివాసరావు, అర్బన్ తహసీల్దార్ రవికుమార్, కార్పొరేటర్లు నిరంజన్‌కుమార్, లలితారాణి పాల్గొన్నారు.


లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందిస్తున్న మంత్రి పొంగులేటి

కనకగిరి గుట్టల వద్ద పర్యాటకుల సందడి


ఆదివాసీ దేవతలకు పూజలు చేస్తున్న పర్యాటకులు

చంద్రుగొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బెండాలపాడు శివారులో గల కనకగిరి గుట్టలను శనివారం పర్యాటకుల బృందం సందర్శించింది. టూరిజం శాఖ ఏర్పాటు చేసిన ఈ పర్యటనకు 15 మంది సభ్యుల బృందం స్థానికుల సహకారంతో ఏడు కిలో మీటర్ల మేర దట్టమైన అడవులతో ఉన్న గుట్టలపైకి ఎక్కి అక్కడి ప్రకృతి అందాలతో పాటు, కాకతీయులు నిర్మించిన గుళ్లు, కట్టడాల గురించి తెలుసుకున్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీవో అశోక్, ఐకేపీ సంతోష్ పర్యాటకులకు వసతి, ఆహార ఏర్పాట్లు చేశారు. రూ.6 కోట్లతో ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని అటవీ శాఖ ఆరు నెలల క్రితం ప్రకటించింది. దీంతో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సైతం కనకగిరి ప్రాంతాన్ని టూరిస్టు ప్రాంతంగా చేయాలని తనవంతు ప్రయత్నాలు చేపట్టారు. ఈక్రమంలోనే కలెక్టర్‌తో పాటు పలు శాఖల అధికారులు ఇటీవల ప్రాంతాన్ని సందర్శించి, తొలి సారి పర్యాటకులను తీసుకువచ్చేందుకు కృషి చేశారు.

అత్తపై అల్లుడి దాడి...

పాల్వంచ, జనవరి 11 ఆంధ్రజ్యోతి: అత్తపై అల్లుడు దాడి చేసిన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన సుడి లావణ్యను సూర్యాపేట జిల్లాకు చెందిన సుడి సురేష్‌రెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. వారు స్థానికంగా పాల్వంచ నటరాజ్ సెంటర్లో నివాసముంటున్నారు. కాగా భార్యాభర్తల మధ్య వచ్చిన విభేదాలతో ఈ నెల 6న లావణ్య తన ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వచ్చింది. శనివారం ఉదయం రెడ్డిగూడెంలోని తన అత్తారింటికి వెళ్లిన సురేష్‌రెడ్డి తన భార్యతో మరలా వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో అడ్డువచ్చిన అత్త పద్మపై దాడి చేశాడు. గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆమెను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు కుంట్ల పద్మ ఫిర్యాదు మేరకు సురేష్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కృష్ణ తెలిపారు.

జూలూరుపాడు టూ నాచారం

జూలూరుపాడు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని మండలంలోని జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామానికి చెందిన భక్తులు వేంకటేశ్వరస్వామి సన్నిధికి పాదయాత్రగా తరలివెళ్లారు. జూలూరుపాడులోని రామాలయంలో భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలోని నాచారం గ్రామంలోని శ్రీ అద్భుత వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు 300 మంది భక్తులు పాదయాత్రగా వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ పాదయాత్రను నిర్వహించినట్లు భక్తులు తెలిపారు. పురోహితుడు నేరేళ్లకుంట శ్రీనివాసరావు రామాలయంలో భక్తుల చేత ప్రత్యేక పూజలను నిర్వహించారు.


పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

జమలాపురం శ్రీవారికి ముత్యాల కవచ అలంకారం


శ్రీవారిని ఊరేగిస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం, జనవరి11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన వేంకటేశ్వర స్వామి ఆ లయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించి, ముత్యాలకవచ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నవితరణ చేశారు. ఈకార్యక్రమంలో ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, వెంకటేశ్వర సేవా సమితి నిర్వాహకులు ఎల్వీ నారాయణరెడ్డి, బొబ్బా ప్రసాద్, వి.వెంకటకృష్ణారావు, లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లాటరీ పేరుతో మోసం...

- రూ.4లక్షల24వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- వివరాలు వెల్లడించిన సీఐ బాలకృష్ణ

ఖమ్మం క్రైం జనవరి 11 (ఆంధ్రజ్యోతి): లాటరీ తగిలిందంటూ ఫోన్‌చేసి డబ్బులు కాజేసిన ఘటనపై ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైనట్లు సీఐ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఓ మహిళకు సైబర్ కేటుగాళ్లు డెలివరీ ఏజెంట్ అని పార్శిల్ ఒకటి వచ్చిందని మెసేజ్ పంపారు. దీంతో పార్శిల్ వారికి ఆమె మెసేజ్ చేయగా వాళ్లు వీడియో కాల్‌చేసి క్యాష్‌గిఫ్ట్ చూపించి మీకు లాటరీ తగిలింది 67 లక్షలు వస్తాయని తెలిపారు. అది రావాలంటే 20వేలు కడితే ఆ లాటరీ అమౌంట్ మీకు పంపిస్తామని చెప్పడంతో అదినమ్మిన బాధితురాలు వారికి విడతల వారీగా రూ.నాలుగు లక్షల ఇరవై నాలుగు వేలను పంపింది. అయినా వారి నుంచి స్పందన రాకపోవడంతో మోసపోయానని గుర్తించి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, తెలియని వారి నుంచి వచ్చిన మెసేజ్‌లకు జవాబులు ఇవ్వడం వంటివి చేయవద్దని సీఐ సూచించారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కూసుమంచి ఎస్ఐ నాగరాజు

కూసుమంచి,జనవరి11(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషిచేయాలని కూసుమంచి ఎస్ఐ నాగరాజు తెలిపారు. రోడ్డు భద్రతావారోత్సవాలను పురస్కరించుకుని శనివారం కూసుమంచి మండలకేంద్రంలో నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో వాహనదారులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలని, అదేవిధంగా వాహనాలకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై కిషోర్‌కుమార్, హైవే అథారిటీ అధికారి సతీష్, పోలీసు సిబ్బంది బాలాజీ, కిషోర్, చందు, గోపి, సురేష్ పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	20 రూ.
వంకాయ	48
గుత్తి వంకాయ	50
బీరకాయ	54
పచ్చిమిర్చి	44
కాకరకాయ	44
బెండకాయ	54
పొట్లకాయ	38
దోసకాయ	34-44
చిక్కుడు	58
నాటుచిక్కుడు	110
గోరుచిక్కుడు	44
క్యాబేజీ	24
దొండ	66-70
సొరకాయ	28
క్యారెట్	44
క్యాప్సికం	50
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	160
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	గేంచేంజర్
శ్రీనివాస:	గేంచేంజర్
సాయిరాం:	గేంచేంజర్
కేపీఎస్:	గేంచేంజర్
తిరుమల:	గేంచేంజర్
సినీగెలాక్సీ:	యూఐ

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో న్యూఇరా విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్

ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి11(ఆంధ్రజ్యోతి):ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ఖమ్మం న్యూఇరా విద్యాసంస్థలకు చెందిన వివాన్ పాఠశాల విద్యార్థులు ఐశ్వర్య, మిత్ర బృందం ఉత్తమ ప్రతిభ కనపరిచారు. సాంకేతికతో సహజ వ్యవసాయం విభాగంలో రాష్ట్ర స్థాయి ద్వితియ బహుమతి లభించిందని విద్యాసంస్థల చైర్మన్ ఐవి రమణారావు, డైరెక్టర్ పి.భూమేశ్వరరావు తెలిపారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

క్రియేటివ్‌లో రోడ్డు భద్రతా వారోత్సవాలు



ట్రాఫిక్ సిగ్నల్స్‌ను వివరిస్తున్న విద్యార్థిని

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):నగరంలోని క్రియేటివ్ పాఠశాలలో శనివారం రోడ్డు భద్రాతా వారోత్సవాలు నిర్వహించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ , స్పీడ్ బ్రేకర్స్, హెల్మెంట్ ధరించటం వల్ల రోడ్డు ప్రమాదాలు నివరించవచ్చునని పాఠశాల కరస్పాండెంట్ కమలాకర్ బిజ్జా, డైరెక్టర్ కౌషిక్ బిజ్జా తెలిపారు. అనంతరం విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్‌పై పాటను పాడించి ప్రతిజ్ఞ చేయించారు.

భక్తిశ్రద్ధలతో కూడారై

108 గంగాళాలతో స్వామివారికి, గోదాదేవికి ప్రత్యేక పూజలు

నేలకొండపల్లి, జనవరి11(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసుత్సవాల్లో భాగంగా విశేషమైన పాశురం, గోదాదేవికి ఇష్టమైన కూడారై ఉత్సవాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. 108గంగాళాలతో స్వామివారికి, గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేలకొండపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అర్చకుడు తూపురాణి మధుసూధనాచార్యులు పూజలు నిర్వహించారు.

ఖమ్మంరూరల్:మండల పరిధిలోని సత్యనారాయణపురంలోని స్వయం భూ కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కోవేలసేవ, కుడారై ఉత్సవాలు నిర్వహించారు.అమ్మవారికి పాశురం శేషేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం పెద్దఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ధర్మకర్తలు సంజీవరెడ్డి, వెంకటరెడ్డి, అర్చకులు కిరణ్ కుమార్, రాజశేఖర్ రెడ్డి, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



సత్యనారాయణపురంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



నేలకొండపల్లిలో..

విద్యాలయాల్లో ఘనంగా సంక్రాంతి వేడుకలు



న్యూవిజన్‌లో..



రెజోనెన్స్ శ్రీనగర్‌కాలనీలో..



గీతాంజలిలో..



స్మార్ట్‌కిడ్జ్‌లో



విన్‌ఫీల్డ్‌లో...



త్రివేణిలో..



బొమ్మాలో..



నిర్మల్‌హృదయ్‌లో..

పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

మాస్‌లైన్ జిల్లానాయకుడు

తిరుమలాయపాలెం,జనవరి11(ఆంధ్రజ్యోతి):అర్హులైన పేదలందరికి రేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పిండిప్రోలులోని రాయల వెంకటనారాయణ స్మారక భవనంలో పార్టీ కార్యర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీలకతీతంగా అర్హులైన పేదలందరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మఇళ్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలన్నారు. కొత్తపించన్లు ఇవ్వాలన్నారు. ఈసమావేశంలో నాయకులు యడ్లపల్లిన వీన్, వెంకటస్వామి, మీగడ సత్యం, చిరంజీవి, వెంకన్న, మధు పాల్గొన్నారు.

మాదిగల గుండె చప్పుడు మహాసభను జయప్రదం చేయండి

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి11(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 7న హైదరాబాదులో తలపెట్టిన మాదిగల గుండెచప్పుడు - లక్షలాది డప్పుల వేలాది గొంతుల మహాసభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు తూరుగంటి అంజయ్య, బచ్చలకూర వెంకటేశ్వర్లు కోరారు. తొలుత నగరంలోని జడ్పీసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కూరపాటి సునీల్, వంగూరి ఆనందరావు, కొలికిపోగు వెంకటేశ్వరరావు, పగిడికత్తుల ఈదయ్య, గాజుల నర్సింహారావు, తూరుగంటి రాము పాల్గొన్నారు.

మాదిగ యువ గర్జనను జయప్రదం చేయాలి

ఖమ్మంచర్చికాంపౌండ్,జనవరి11(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి2న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో జరిగే మాదిగ యువ గర్జనను జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్టే గురుమూర్తి, మాదిగ జేఏసీ ఖమ్మం జిల్లా యూత్ అధ్యక్షుడు రాయల రాంబాబు కోరారు. శనివారం నగరంలోనిప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

కామేపల్లి, జనవరి11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొన్నెకల్ ప్రభుత్వ పాఠశాలకు మాలోత్ అమర్‌సింగ్ జ్ఞాపకార్థంగా స్వీచ్‌పోడియం, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కుర్చీలను వితరణగా అందజేశారు. పదోతరగతి విద్యార్థులకు సాయంత్రం అల్పహారానికి బి.పాపలాల్ అయ్యే ఖర్చును భరిస్తానని తెలిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బానోత్ ఈరునాయక్, బాలునాయక్, మాలోత్ రామారావు, మాలోత్ రవి, రావోజీ, బానోత్ పాపాలాల్, బావ్‌సింగ్ ఎంఈఓ జీ. వెంకట్, గ్రామ పెద్దలు నర్సింహారెడ్డి, క్రిష్టారెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్

పాఠశాల వార్షికోత్సవం

ఖమ్మంక్రైం,జనవరి11 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి ఉత్తమ విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఈవో సోమశేఖరశర్మ అన్నారు. శ్రీకృష్ణప్రసాద్ ఉన్నత పాఠశాల 30వ వార్షికోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా పాఠశాల చైర్మన్ నిశితాశర్మ జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ప్రతిభ కనబరిచిన వారికి పోలీసు కమిషనర్ సునిల్‌దత్ బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ఏఆర్ఏసీపీ నరసయ్య, సుశీల్‌సింగ్, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిశితాశర్మ

పగిడిపత్తి ఆశయ సాధనకు కృషి చేద్దాం

పాలేరు మాజీ శాసనసభ్యుడు కందాళ

నేలకొండపల్లి,జనవరి11(ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ నాయకుడు, రాజారాంపేట సొసైటీ మాజీ అధ్యక్షుడు పగిడిపత్తి శ్రీను ఆశయసాధనకు ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త కృషి చేయాలని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీను ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని చెర్వుమాధారం గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శ్రీను విగ్రహాన్ని కందాళ ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాలేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ముజ్జుగూడెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, కోటి శ్రీనివాసరావు, భూక్యా సుధాకర్, గొలుసు రవి, షేక్.హుస్సేన్, మరికంటి రేణుబాబు, శంకర్, ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్రీడాపోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర ట్రాన్స్‌కో, డిస్కమ్స్ విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్, లాన్‌టెన్నీస్ పోటీలు ముగిశాయి. ఫుట్‌బాల్ విభాగంలో కరీంనగర్ జట్టు ప్రథమ స్థానం సాధించగా, ఖమ్మం ఆపరేషన్స్ జట్టు ద్వితియస్థానం, మహబూబ్‌నగర్ జట్టు తృతియ స్థానం సాధించింది. టెన్నీస్ పోటీలో ఇప్పటికే కరీంనగర్ ట్రాన్స్‌కో జట్టు ప్రథమ స్థానం సాధించగా హైదరాబాద్ విద్యుత్‌సౌధ ద్వితీయ, కార్పొరేట్ ఆఫీస్ హైదరాబాద్ జట్టు తృతీయ బహుమతులు సాధించాయి. పోటీల అనంతరం విజేతలకు ఎస్ఈలు బి.శ్రీనివాస్, సురేందర్, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో స్పోర్ట్స్ అధికారి ఎన్. జగన్నాథ్, స్పోర్ట్స్ సెక్రెటరీ ఏడీఈ బాబూనాయక్, డీఈలు నాగరత్నం, బాబూరావు, రవి తదితరులు పాల్గొన్నారు.



ద్వితియ బహుమతి సాధించిన ఖమ్మం

కాంగ్రెస్‌లో 300 మంది చేరిక

నేలకొండపల్లి, జనవరి11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాయగూడెం గ్రామానికి చెందిన దాదాపు 300మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అందరికీ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నంబూరి రామారావు, కొర్లకుంట నాగేశ్వరరావు, కొడాలి గోవిందరావుల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నంబూరి రామారావు, కొడాలి గోవిందరావు, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కోసూరి సత్యనారాయణ, సూరేపల్లి ప్రేమ్‌కుమార్, సూరేపల్లి సుజాత, బైరు లక్ష్మీనారాయణ, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ స్తూపాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

నేలకొండపల్లి,జనవరి11(ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ శనివారం నేలకొండపల్లిలోని బౌద్ధస్తూపాన్ని సందర్శించారు. ఖమ్మం, టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి చరిత్రను వివరించారు.ఏఏ అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారు?సందర్శకులను ఆకర్షించటానికి చేపడుతున్న చర్యలేమిటి? సుమన్‌చక్రవర్తినడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నేలకొండపల్లి ఎంపీఓ శివ, ముజ్జుగూడెంగ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

‘మంచుకొండ ఎత్తిపోతల’తో ఖమ్మం సస్యశ్యామలం

- మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు, నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి11(ఆంధ్రజ్యోతి): మంచుకొండ ఎత్తిపోతల పథకంతో ఖమ్మం నియోజకవర్గం సస్యశ్యామలవుతుందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. శనివారం మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణుల ఖమ్మం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. సోమవారం సాయంత్రం మంచుకొండలో నిర్వహించనున్న ఎత్తిపోతల పథకం శంకుస్థాపన కార్యక్రమంపై సమావేశంలో నాయకులకు మార్గదర్శకం చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎక్కడ పనిచేసినా ఆ ప్రాంతంలోని రైతులు, అన్ని వర్గాల ప్రజల వందేళ్ల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పథకాలను అమలు చేస్తారని మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా ఖమ్మం నియోజకవర్గంలోని 33 చెర్వులకు సాగర్‌జలాలు అందుతాయన్నారు. కరువు ప్రాంతంగా ఉన్న రఘునాథపాలెం మండలంలోని గ్రామాల్లో రెండు, మూడు పంటలు సాగులోకి వస్తాయని హర్షం వ్యక్తం చేశారు. మంత్రిగా పనిచేసిన ఏడాది కాలంలోనే రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లాకాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు పాలేపు విజయవెంకటరమణ, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, రాపర్తి శరత్‌కుమార్, మిక్కిలినేని మంజుల నరేందర్, కొప్పెర సరిత ఉపేందర్, నగర కాంగ్రెస్ కార్యనిర్వాహఖ అధ్యక్షులు నాగండ్ల దీపక్‌చౌదరి, యర్రగర్ల హనుమంతరావు, తాతా రఘురాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

మేనమామ అంతిమయాత్రలో పాల్గొన్న నామ

ఖమ్మంటౌన్,జనవరి11(ఆంధ్రజ్యోతి): ఖమ్మం మాజీఎంపీ నామా నాగేశ్వరరావు మేనమామ మారెడ్డి వెంకట నర్సయ్య అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. శనివారం జరిగిన అంత్యక్రియల్లో నామా పాల్గొన్నారు. తన సోదరులతో కలిసి నామా మేనమామ పాడె మోశారు. నగరంలోని బ్యాంక్ కాలనీలో మేనమామ నివాసానికి కుటుంబసభ్యులతో వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాగా వెంకట నర్సయ్య భౌతిక కాయానికి పలువురు నివాళులర్పించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నివర్గాలు అభివృద్ధి

- 44వ డివిజన్‌లో ముగ్గుల పోటీలు
- బహుమతులు అందజేసిన మేయర్, కార్పొరేటర్

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు.44వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ ఆధ్వర్యంలో గంగపుత్ర వీధిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. శనివారం విజేతలకు బహుతుల అందించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. గంగపుత్ర సంఘం గౌరవ అధ్యక్షుడు శంకరయ్య, సోమయ్య,సుదర్శన్,దుర్గేందర్‌రావు పాల్గొన్నారు.

51వడివిజన్‌లో...

ఖమ్మంటౌన్: నగరంలోని 51వడివిజన్‌లో కార్పొరేటర్ శీలంశెట్టి రమా వీరభద్రం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ముగ్గుల పోటీలు నిర్వహించారు. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ హాజరయ్యారు. మొదటి బహుమతి వాషింగ్ మిషన్‌ను బాసాని ఈశ్వరమ్మ గెలుచుకున్నారు. రెండోబహుమతి పట్టీలను దొడ్డ కవితారెడ్డి, మూడో బహుమతి గ్రైండర్‌ను చదలవాడ శోభారాణి గెలుచుకున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి పొంగులేటి మాధురి

ఖమ్మంరూరల్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సతీమణి పొంగులేటి మాధురి అన్నారు. ఖమ్మంరూరల్ మండలంలోని కరుణగిరి ప్రాంతంలో పీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలను పరిశీలించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.ఈకార్యక్రమంలో తుంబూరి దయాకర్‌రెడ్డి, మద్ది మల్లారెడ్డి, మద్ది వీరారెడ్డి, మహేష్, కిషోర్ రెడ్డి, పంతులు నాయక్, తోట వీరభద్రం పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: పిండిప్రోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. విజేతలకు మంత్రిపొంగులేటి సతీమణి మాధురిరెడ్డి బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో తుంబూరు దయాకరరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, తహసీల్దార్ పీవీ రామకృష్ణ ఎంపీడీవో సిలార్ సాహెబ్, ఎంపీవో సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, ఉన్నం రాజశేఖర్, పత్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న మేయర్ నీరజ



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



బహుమతులు అందజేస్తున్న మాధురి

ఆంధ్రజ్యోతి
ZONE
ఆదివారం 12 జనవరి 2025
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY
8



● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

ఆదివాసీ ప్రజాప్రతినిధుల శిక్షణకు హాజరైన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



ఆదివాసీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున్‌సాగర్‌లో జరుగుతున్న ఆదివాసీ ప్రజాప్రతినిధుల శిక్షణ కార్యక్రమానికి శనివారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ హాజరయ్యారు. శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నేడు వైరాలో ఎమ్మెల్యే పర్యటన

వైరా, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఆదివారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వైరాలోని క్యాంపు కార్యాలయంలో 240 మందికి సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేయనున్నారు.

నేడు ఎస్‌జేకేఎం జూనియర్ కళాశాల రజతోత్సవం

ఎర్రుపాలెం, జనవరి11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఎర్రుపాలెం గ్రామంలోని ఎస్‌జేకేఎం(సర్దార్ జమలాపురం కేశవరావు మెమోరియల్) జూనియర్ కళాశాల రజతోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగిరెడ్డి సౌజన్య శనివారం ఒకప్రకటనలో తెలిపారు. ఈప్రాంతానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు తెలంగాణ సర్దార్, జమలాపురం కేశవరావు పేరు మీద 25 ఏళ్ల కిందట దండెం సత్యనారాయణరెడ్డి కళాశాలను స్థాపించారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

17న బహిరంగ వేలం పాట

ఏన్కూరు, జనవరి11(ఆంధ్రజ్యోతి): గార్లొడ్డు శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయ ప్రాంగణం వద్ద లడ్డూ ప్రసాదం, పులిహోర విక్రయించేందుకు జనవరి17వతేదీ శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈవో ఎస్‌వీడీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు దేవాదాయ కమిషనర్ ఖమ్మం కార్యాలయం నందు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పాటలో పాల్గొనాలని కోరారు. వివరాలకు ఆలయ ఈవోను సంప్రదించాలన్నారు.

'గనులలో రక్షణ సూత్రాలు అనుసరించాలి'

సత్తుపల్లిరూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపరితల గనులలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు రక్షణ సూత్రాలు అనుసరించి పనిచేయాలని జీఎం (సేఫ్టీ) చింతల శ్రీనివాస్, జీఎం (సేఫ్టీ) కొత్తగూడెం రీజియన్ తివారి అన్నారు. శనివారం కిష్టారం ఓసీని అధికారులు ఆకస్మికంగా సందర్శించారు. కార్యక్రమంలో పీవో ఎంవీ.నరసింహారావు, పీఈ రమణరావు, ఏరియా రక్షణ అధికారి వెంకటేశ్వర్‌రావు, కాలరీ మేనేజర్ రామకృష్ణ, అడిషనల్ మేనేజర్ బాబు, రక్షణ అధికారి గోపికిషోర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఓసీ మేనేజర్ రామకృష్ణ ఆవిష్కరించి కార్మికులకు, అధికారులకు అందజేశారు..

పంచాయతీలు పరిశుభ్రంగా ఉండేలా చూడండి

» వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లిరూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని రామగోవిందాపురంలో రూ.20లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామస్థులు తాగునీరు సమస్య ఉందని తెలపగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి ఎండాకాలంలో ఈ సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు. గ్రామంలో 1996-97లోనే సీపీడబ్ల్యూసీ నిర్మించామని, గ్రిడ్ సమస్యలు ఉన్నప్పటికీ వెంటనే పరిష్కరించాలని, సంక్రాంతి రోజున మంచినీళ్లు అందించాలని సూచించారు. ఈ క్రమం లో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఏఈలు అక్కడ లేకపోవడంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఇళ్లు కురుస్తున్నాయని, సుమారు 15ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని బాధితులు తెలపగా త్వరలో ఇళ్లను నిర్మించాలని ఎమ్మెల్యే డాక్టర్ రాగమయికి సూచించారు. అదేవిధంగా గ్రామంలో ఏళ్లుగా సమస్యగా మారిన గిరిజనుల భూవివాదంపై త్వరగా పరిష్కారం చూపాలని డీసీవో గంగాధర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో ఆశాలత, డీఎల్‌పీవో రాంబాబు, డిప్యూటీ సీఈవో నాగపద్మజ, ఎంపీడీవో నాగేశ్వరరావు, సీడీపీవో కనకదుర్గ, ఏవో వై.శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

యువతను సన్మార్గంలో నడిపించడం అందరి బాధ్యత

సత్తుపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): యువతను సన్మార్గంలో నడిపించడం అందరి బాధ్యతని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన సత్తుపల్లిలో వివేకానంద విగ్రహం వద్ద నిర్మించిన వివేకానంద కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నియోజకవర్గానికి గతం నుంచి ఉన్న మంచి సంప్రదాయాన్ని ఇకముందు కూడా కొనసాగించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. వివేకానంద కమ్యూనిటీ హాల్‌ను ప్రయివేటు విద్యాసంస్థలు నిర్మించి అందులో నిరుపేద విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెప్పించడం, ఇతర సామాజిక కార్యక్రమాలను నిర్వహించాలని తలపెట్టడం అభినందనీయమని అంటూ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మల్లు నందిని

క్రీడాకారులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

» అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని

బోనకల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు విద్యతో పాటు క్రీడల్లోను రాణించాలని అమ్మ ఫౌండేషన్ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి సతీమణి మల్లు నందిని అన్నారు. మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10 మండలాల స్థాయి క్రికెట్, కబడ్డీ పోటీలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల నిర్వహణ పోటీతత్వాన్ని పెంచుతుందన్నారు. క్రీడాస్ఫూర్తి జీవితంలో ఎదగడానికి దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, కందుల పాపారావు, బుంగా రాములు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, మరీదు బరకయ్య, పాల్గొన్నారు.

దశరథ్‌నాయక్‌కు జాతీయస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న దశరథ్‌నాయక్

తల్లాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం రంగంబంజర గ్రామానికి చెందిన లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్‌నాయక్‌కు శనివారం జాతీయ బంజారారత్న అవార్డు అందుకున్నారు. మహారాష్ట్రలోని తీర్థక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో సామాజిక సేవకుగానూ దశరథ్‌నాయక్‌కు అవార్డును బాబూసింగ్ మహరాజ్ అందజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

» బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



సమావేశంలో మాట్లాడుతున్న తాతా మధు

మధిరటౌన్, జనవరి11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేలా ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా పని చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. శనివారం మధిర బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి ఏ నాయకుడు పోయినా పార్టీకి నష్టం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరావు, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, తాళ్లూరి జీవన్ కుమార్ తదితరులున్నారు.

'విద్యార్థులు ఉన్నత ఆశయంతో ముందుకు సాగాలి'



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సాహితీవేత్త రావులపాటి సీతారాం

వైరా, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత ఆశయంతో క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదగాలని సాహితీవేత్త, కవి, కాళోజీ అవార్డు గ్రహీత డాక్టర్ రావులపాటి సీతారాం అన్నారు. శనివారం వైరా న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో నవ వసంతాల వేడుకను వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైరాలో కాలుష్యరహితంగా ఆహ్లాదకరమైన విశాల ప్రాంగణంలో పచ్చని చెట్లతో న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల హరిత పాఠశాలగా రూపాంతరం చెందిందని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు జూనియర్ కళాశాలను ప్రారంభించి తొలి అడుగే బలంగా ఉండాలన్నట్లుగా ముగ్గురు విద్యార్థులను డాక్టర్లుగా తీర్చిదిద్దడం, అనేకమంది ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశం పొందడం ప్రశంసనీయమన్నారు. ఏసీపీ రెహ్మాన్ మాట్లాడుతూ నవ వసంతాల కాలంలోనే న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల ఇంగ్లీష్‌కు అధిక ప్రాధాన్యతనిస్తూ లైఫ్‌స్కిల్స్‌కు పెద్దపీట వేసిందని కొనియాడారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్లు డాక్టర్ కాపా మురళీకృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్, ప్రిన్సిపల్ షాజీ మాథ్యూవ్, ఏవో నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

తనికెళ్లలో మంత్రి పొంగులేటి పర్యటన



అభివాదం చేస్తున్న మంత్రి పొంగులేటి

కొణిజర్ల, జనవరి11(ఆంధ్రజ్యోతి): అన్నా...అంతా బాగున్నారా అంటూ రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కార్యకర్తలను, నాయకులను అభివాదం చేస్తూ ఆప్యాతగా పలకరించడంతో కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. శనివారం మంత్రి అమ్మపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు, దూదెకుల సంక్షేమసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గాలిబ్‌పాషా ఇంట్లో శుభకార్యాయానికి హాజరయ్యారు. అనంతరం వెళ్లుతూ కారుఎక్కి కార్యకర్తలకు అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, విజయబాయి, మాజీ ఎంపీపీ గోసు మధు, వైరా ఆత్మ చైర్మన్ కోసూరి శ్రీనువాసరావు, రాయల పుల్లయ్య, కోసూరి నాగస్రైదులు, వెంకటప్పయ్య, గడల నరేందర్‌నాయుడు, కోటి, శేషగిరిరావు, సురేష్ పాల్గొన్నారు.

మహనీయులను ఎన్నటికీ మరవద్దు

» సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



ఓబన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మహనీయులను ఎన్నటికీ మరువద్దని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా సత్తుపల్లి వడ్డెర సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ హాజరై ఓబన్న విగ్రహానికి పూ లమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుళ్ల నరసింహారావు, అద్దంకి అనిల్, ఉప్పు హనుమంతరావు, దేవళ్ల పెద్దిరాజు, దేవళ్ల శ్రీను, వెంకటేశ్వరరావు, బత్తుల అనంతరాములు, సాంబయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైరా, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వైరాలోని హనుమాన్‌బజార్‌లో ఒడ్డే ఓబన్న జయంతిని నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి ఓర్సు శ్రీనివాస రావు, మహలక్ష్మి ఆలయ చైర్మన్ బండారు తిరుపతిరావు, తురక చిన్నరాములు, తిరుపతి కోటదాసు, ఉప్పు శ్రీను, ఓర్సు రామకృష్ణ, వేముల సురేష్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధితో భరోసా : మువ్వా



చెక్కు అందిస్తున్న మువ్వా విజయబాబు

సత్తుపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసా కల్పిస్తుందని టీజీవీడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు అన్నారు. మండలంలోని సిద్దారం గ్రామానికి చెందిన బాల సుధాకరరావుకు మంజూరైన రూ.42వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, మువ్వాలకు బాల సుధాకరరావుతో పాటు గ్రామస్థులు శివ, సతీష్‌లు ధన్యవాదాలు తెలిపారు.

కరివేద అప్పారావుకు పలువురి నివాళులు

మధిరటౌన్, జనవరి11(ఆంధ్రజ్యోతి): సుశీల విద్యా సంస్థల చైర్మన్ కరివేద వెంకటేశ్వరరావు తండ్రి కరివేద అప్పారావు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన విషయం విదితమే. శనివారం మధిరలోని ఆయన స్వగృహంలో జరిగిన దశదిన కార్యక్రమంలో పలువురు హాజరై అప్పారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ చైర్మన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరావు, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధికారి వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, మునిసిపల్ చైర్మన్ లత, కౌన్సిలర్లు మల్లాది వాసు, సవిత తదితరులు ఉన్నారు.

గీత కార్మికులకు 'కాటమయ్య' కిట్ల పంపిణీ

చింతకాని, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేపల్లెవాడ, లచ్చగూడెం, చింతకాని గ్రామాల కల్లు గీత కార్మికులకు శనివారం కాటమయ్య కిట్ల పంపిణీ నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి పాదయాత్ర సమయంలో గౌడ కులస్థులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కాటమయ్య కిట్ల పంపిణీ నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడిపల్లి భాస్కర్ తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐ కే. సాయిబాబు, రాష్ట్ర కాటమయ్య కిట్ల కోఆర్డినేటర్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ మేనేజింగ్ డైరెక్టర్ నరసింహారావు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం

» బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కమల్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజు

బోనకల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జరగబోయే స్థానిక ఎన్నికల్లో గులాబీ సైనికులు సత్తా చాటి అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు కోరారు. మండలంలోని రావినూతల గ్రామంలో శనివారం నాగేంద్రబాబు కుటుంబానికి రూ. 2లక్షల పార్టీ బీమా చెక్కును మాజీ సీడ్స్ కార్పోరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, వేమూరి ప్రసాద్, బాణోతు కొండ, గద్దల వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ధర్నా

సత్తుపల్లిరూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు జీవో నంబర్ 22ప్రకారం వేతనాలను పెంచాలని శనివారం స్థానిక జేవీఆర్ ఓసీ పీవో కార్యాలయం ఎదుట సింగరేణి కాంట్రాక్ట్ యూనియన్, ఏఐటీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సముద్రాల సుధాకర్, యర్రగాని కృష్ణయ్య, జీ.వీరాస్వామి, కత్తెర్ల రాములు, యోబు, సూర్యప్రకాష్, భరణి, డీ.ప్రసాద్, కాగితపు వెంకటేశ్వర్లు, నరసింహారావు, లక్ష్మి, రాధ, ఏసు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలు



వైరాలో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



బాలాజీ పాఠశాలలో బొమ్మల కొలువులో పాల్గొన్న విద్యార్థులు

'యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు'

చింతకాని, జనవరి 11(ఆంధ్రజ్యోతి): యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి ఎస్. మానస అన్నారు. శనివారం మండల పరిధిలోని సొసైటీతో పలు ప్రయివేటు ఎరువుల దుకాణాలను ఆమె పరిశీలించారు. 2024- 25 సీజన్‌కు 4వేల మెట్రిక్ టన్నులు యూరియా అవసరముం డగా, ఇప్పటి వరకు 2,145 టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు.

మాదిగ యువ గర్జనను జయప్రదం చేయాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి11(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి2న ఉస్మానియా యూనివర్శిటీ ఆర్ట్స్ కాలేజీలో జరిగే మాదిగ యువ గర్జనను జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్టే గురుమూర్తి, మాదిగ జేఏసీ ఖమ్మం జిల్లా యూత్ అధ్యక్షుడు రాయల రాంబాబు కోరారు. శనివారం నగరంలోనిప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు పట్ల హర్షం

మధిరటౌన్, జనవరి11(ఆంధ్రజ్యోతి): సిరిపురం గ్రామ ప్రజలకు, జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇచ్చిన మాట నిలుపుకున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సిరిపురం జూనియర్ కళాశాల భవనాల నిర్మాణం కోసం ఐదు కోట్ల రూపాయల నిధుల మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, దుంపా వెంకటేశ్వర రెడ్డి, పాటిబండ్ల సత్యంబాబు, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

అనంతసాగర్‌లో ముగ్గుల పోటీలు

చింతకాని, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శ్రీ చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులకు దాత నూతలపాటి రమ్య అందజేశారు.

'నందమూరి' క్యాలెండర్ ఆవిష్కరణ

వైరా, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ యువసేన ఆధ్వర్యంలో రూపొందించిన 2025వ సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం వైరాలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకూరి చలపతిరావు ఆవిష్కరించారు. నందమూరి తారకరామారావు 75వ, బాలకృష్ణ 50వ నటనజీవిత ప్రస్థానం సందర్భంగా ఈ క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో టీడీపీ వైరా మండల కమిటీ అధ్యక్షుడు కిలారు సురేందర్, సొసైటీ మాజీ చైర్మన్ మందడపు మధుసూదన్‌రావు, మన్నేపల్లి ప్రదీప్, మోత్కూరి వెంకటేశ్వర్లు, బోడేపూడి మురళీ, పాసంగులపాటి శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఘనంగా కూడారై ఉత్సవం



సత్తుపల్లిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



తల్లాడ: పుష్పాలతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



చింతకానిలో కోదండరామస్వామి ఆలయంలో లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం